క్లుప్తంగా

గద్దర్‌కు నివాళి



వెంకటాచలం: మండలంలోని సరస్వతి నగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్ తన పాట, ఆట, మాటల ద్వారా యావత్ తెలుగు సమాజంలో చైతన్యం తెచ్చారని కొనియాడారు. గద్దర్ చేసిన అనేక కార్యక్రమాలు ఎంతో గుర్తింపు పొందాయని తెలియజేశారు. పేదల బాధల్ని తన పాటల ద్వారా వినిపించి సమాజాన్ని మేల్కొలిపారని చెప్పారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ హరినారాయణన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : జగనన్నకు చెబుదాం (స్పందన) అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో కలెక్టర్, జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పుడు సకాలంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా వి.గాయత్రి అనే దివ్యాంగురాలికి బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కింద నియామకపత్రాన్ని కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మిత, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు కె.సాంబశివారెడ్డి, హేనాసుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ గంగాభవాని, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, సాంఘిక సంక్షేమాధికారి రమేష్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, హనుమాన్ ప్రసాద్, వివిధ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) నెల్లూరు టౌన్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో పనిచేసిన ఎన్వీ శ్రీధర్ (52) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో డీసీసీబీ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సభ్యులు తమ ఒకరోజు వేతనం కింద రూ.1,80,513 సేకరించారు. దీనిని నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆ బ్యాంక్ సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు చేతుల మీదుగా చెక్కును శ్రీధర్ కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ప్రజ్ఞ, జిల్లా అధ్యక్షురాలు సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి, కోశాధికారి గురునాథం, నాయకులు సాజిద, నళిని, గాయత్రి, వరలక్ష్మి, తేజస్విని, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రిస్టియన్ల శాంతి ర్యాలీ

నెల్లూరు(బృందావనం): మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటనలను నిరసిస్తూ మంగళవారం శాంతి ర్యాలీ చేపట్టనున్నట్లు జిల్లా క్రిస్టియన్ల సమైఖ్య వేదిక పిలుపునిచ్చింది. నగరంలోని డానిహాల్‌లో ఆ వేదిక నేతలు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని సుబేదారుపేట ఏబీఎం కాంపౌండ్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ కనకమహల్ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, పాత జెడ్పీ ఆఫీస్, బారకాసు మీదుగా కలెక్టర్ కార్యాలయం చేరుతుందన్నారు. సమావేశంలో దయాసాగర్, సురేంద్రబాబు, రాజశేఖర్ దాసరి, గుర్రం అరుణ్‌కుమార్, శరత్, ఎలీషాకుమార్ పాల్గొన్నారు.

పెన్నాలో పసికందు మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : పెన్నానదిలో (రైల్వే బ్రిడ్జి కింద) రోజులు నిండని పసికందు (మగ) మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. స్థానిక వీఆర్వో సందానిబాషాకు సమాచారం అందడంతో ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వేణుగోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో నీటిలో నుంచి చిన్నారి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. పురిట్లోనే మృతిచెందాడో? మరే ఇతర కారణమో తెలియాల్సి ఉంది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

- సీఎం చొరవతో రెవెన్యూలో సరికొత్త సంస్కరణలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పొజిషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పొదలకూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పలువురికి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రెవెన్యూ వ్యవస్థలో సరికొత్త సంస్కరణలను అమల్లోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. 20 ఏళ్లుగా అనుభవిస్తున్న భూములకు హక్కు కల్పిస్తున్నామని, సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలను అందజేస్తున్నట్లు చెప్పారు. చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం లభించిదన్నారు. అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ పర్యవేక్షణలో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలను అందజేస్తామని, పొజిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పీఓటీ) ద్వారా రైతులకు హక్కులను కల్పించడం జరుగుతుందన్నారు. అడవి, నీరు ఉన్న భూములకు తప్పించి ఇతర భూములు చేసుకుంటూ ఉంటే పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. తమ ప్రభుత్వం పేదల పట్ల ఉదారంగా వ్యవహరిస్తోందని, సాగు చేసుకునే పేదవాడికి భూహక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గతంలో రెవెన్యూ కార్యాలయానికి వస్తే కుప్పలు తెప్పలుగా సమస్యలు ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. రానున్న మూడు నెలల్లో నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. వీఆర్వోలు సమస్య వస్తే వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం తనకు సంతృప్తినిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఇతర మండల అధికారులు, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా ఉన్నారని, వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని పల్లాప్రోలు, పోలినాయుడు చెరువు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలో దాదాపు 91,830 ఇళ్లను సందర్శించినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎమ్మెల్యేలు ప్రతి ఊరికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడం జరుగుతోందన్నారు. ప్రజల వద్దకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వెళుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి వారికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించి బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. సచివాలయ నిధులతో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

రూ.20.50 లక్షల మంజూరు

మండలంలోని ఇస్కపాళెం, పల్లాప్రోలు, పోలినాయుడు చెరువు గ్రామాలకు చెందిన మూడు పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంక్ రుణం, స్త్రీనిధి రుణంతో కలిపి సుమారు రూ.20.50 లక్షలను అందజేశారు. వీటితో జీవనోపాధి పొందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ శ్యామ్, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీటీసీ మంజులమ్మ, ఏపీఎం లలిత, కౌన్సిలర్లు షకీలాబేగం, శివకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, యానాదిరెడ్డి, చీర్ల ప్రసాద్, సత్యనారాయణ, నాయకులు సీతారామిరెడ్డి, భరత్, విల్సన్, ప్రవల్లిక, రసూల్, డాక్టర్ అల్లాభక్షు, చిన్న అల్లాభక్షు, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



దొరువులో చేపలు విడుదల చేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ హెచ్చరించారు. ముత్తుకూరులోని మధురానగర్‌లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బందిచే సోమవారం మలాథియాన్ మందు స్ప్రే చేయించారు. దొరువులు, చెరువుల్లో గంబూసియా చేపలు విడుదల చేశారు. స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో వ్యాపించిన మలేరియా కేసులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలని, చెత్త వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

మనుబోలు: మండలంలోని నాలుగు పంచాయతీ వార్డులకు మంగళవారం నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బండేపల్లి 3వ వార్డు, చెర్లోపల్లి 8వ వార్డు, మడమనూరు 7వ వార్డు, మనుబోలు 4వ వార్డులకు సంబంధించి 8 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను మనుబోలు ఒకటో సచివాలయంలో స్వీకరిస్తారని తెలిపారు.

రెండు వార్డుల్లో..

తోటపల్లిగూడూరు: మండలంలోని కోవెరపాళెంలో ఆరో వార్డు, పేడూరులో 8వ వార్డు ఉప ఎన్నికలకు సంబంధించి మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న నామినేషన్ల స్క్రూటీనీ, 12న ఆర్డీఓకు అప్పీల్‌కు అవకాశం ఉంటుందన్నారు. 13న నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉందన్నారు. 14న అభ్యర్థుల తుది జాబితాను ప్రటిస్తామన్నారు. 19న పోలింగ్ నిర్వహించి అదేరోజు సాయంత్రానికి ఫలితాలను ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



కిట్లను అందజేస్తున్న సీడీపీఓ

పొదలకూరు: స్థానిక విష్ణ్వేశ్వరపురం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరునెలల పాటు బిడ్డకు పాలు ఇవ్వాల్సిందిగా సూచించారు. అన్ని పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని, బాలామృతం రోజుకు 100 గ్రాములు బిడ్డకు పెడితే బరువు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీకల్యాణి, సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రమణమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న మోటార్‌బైక్

బుచ్చిరెడ్డిపాళెం: వాకింగ్ చేస్తున్న కొమ్మి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి మోటార్‌బైక్‌పై వెళ్తూ వెనుక నుంచి ఢీకొన్న ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కేఎం ఆస్పత్రి వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీస్‌ల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటేశ్వర్లు వేకువజామున రోడ్డు మార్జిన్‌లో వాకింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న బైక్ అతి వేగంగా వెంకటేశ్వర్లును ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీర ప్రతాప్ తెలిపారు.

చేనేత కార్మికులకు సన్మానం



చేనేత కార్మికులను సత్కరించిన దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కాశీపాళెంలో ఉన్న భద్రావతి సమేత భావన రుషీశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ అగ్గిపెట్టెలో పట్టేంత చీరను తయారు చేయడం వారి గొప్పతనమన్నారు. స్వాతంత్ర్యోమ కాలం నుంచి చేనేత రంగానికి ప్రాధాన్యం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో రమణయ్య, నరసింహమూర్తి, శ్రీధర్, సుధీర్‌కుమార్, చలమయ్య, నరసయ్య, బాబు, మల్లికార్జున రమేష్, స్వామి, కేశవ, దయాకర్ పాల్గొన్నారు.

పడవకు నావికుడు కావలెను!



తాడు సాయంతో పడవ నడుపుతున్న దృశ్యం

- తాడు సాయంతో ఉప్పుటేరులో ప్రయాణం
- ఏరు దాటేందుకు పడవే ఆధారం



పట్టపుపాళెం వద్ద ఉప్పుటేరు

ముత్తుకూరు: ఇంజిన్, తెడ్డు సాయంతో పడవ నడపడం సర్వసాధారణం. అయితే, తాడు సాయంతో పడవ నడపడం ముత్తుకూరు మండలంలోని దొరువుపాళెం పంచాయతీలో ఉప్పుటేరు వద్ద మాత్రమే చూడగలం. ప్రస్తుతం తాడు సాయంతో పడవ నడిపే నావికుడు కూడా కరువయ్యాడు. సుమారు 300 మీటర్ల వెడల్పున్న ఉప్పుటేరుకు ఆవలి వైపు వెంకటాచలం మండలంలోని తిరుమలమ్మపాళెంలో స్థానిక రైతులకు 250 ఎకరాల పొలాలున్నాయి. సేద్యం చేయాలంటే రైతులు స్థానిక ఎస్సీకాలనీ వద్ద రేవు నుంచి పడవలో ఉప్పుటేరు దాటాలి. అయితే, ఈ పడవకు మోటారు లేదు. తెడ్డు అంతకన్నా లేదు. ఏటి మధ్య కొయ్యలు నాటి, వాటికి కట్టిన తాడు ఆధారంగా ఎంతోకాలంగా పడవ నడుపుతున్నారు. వ్యవసాయ పనులు మొదలైతే ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు, వ్యవసాయ కూలీల ప్రయాణంతో ఈ పడవకు తీరికే ఉండదు. ఎరువులు, విత్తనాల బస్తాలు, కూలీలకు భోజనం సైతం ఈ పడవ ద్వారానే ఆవలి గట్టుకు చేర్చాలి. తాడు సాయంతో పడవ నడిపే వ్యక్తికి రైతులు ఏటా ఎకరాకు 6 ముంతల ధాన్యం ఇస్తారు. కొందరు ఏరు దాటిన తర్వాత డబ్బులు కూడా ఇస్తున్నారు. అయితే, ఇటీవల ఈ పడవ నడిపే నరసయ్య సక్రమంగా రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రమం తప్పకుండా పడవ నడిపే వ్యక్తి కోసం అన్వేషిస్తున్నారు.

మన బడికి మహర్దశ



కోవూరు జెడ్పీహెచ్ఎస్‌లో అమర్చిన ఐఎఫ్‌పీ

- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ చదువులు
- 60 మందికొక స్మార్ట్ టీవీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కోవూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంది. బడికి పిల్లలను పంపే ఏ తల్లి ఆర్థిక ఇబ్బంది పడకూడదని అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. నాడు – నేడు పథకం ద్వారా అనేక పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్, ప్రైవేట్‌ను తలదన్నేలా మౌలిక వసతులు కల్పించింది. బోధనలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. డిజిటల్ విద్యకు చర్యలు చేపట్టింది.

కోవూరు నియోజకవర్గంలో 343 పాఠశాలల్లో విద్యార్థులు చదువుతున్నారు. మొదటి విడతలో నాడు – నేడు పనులు పూర్తయిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్), స్మార్ట్ టీవీలను ప్రభుత్వం సరఫరా చేసింది. 60 మంది విద్యార్థులకు ఒక టీవీ చొప్పున కేటాయించారు. సెక్షన్లను పరిగణలోకి తీసుకుని టీవీలను తరగతి గదుల్లో అమర్చారు. డిజిటల్ విద్యను అందుబాటులోకి తేవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బోధన ఇలా..

ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అత్యున్నత స్థాయి బోధన అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న వారికి స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆడియో, వీడియోల ద్వారా ఆకట్టుకునేలా బోధన జరుగుతుంది. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేశారు. ముందుగా రికార్డ్ చేసిన పాఠాలతో సహా స్టడీ మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో యాక్సిస్ చేసుకోవచ్చు. సెల్‌ఫోన్ లేదా పెన్‌డ్రైవ్ ఇంటర్నెట్ వంటి వాటితో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించనున్నారు.

ఎంతో ఉపయోగం

విద్యార్థులను పాఠం వైపు అట్రాక్ట్ చేయడానికి ఆడియో, వీడియోలు ఎంతగానో ఉపయోగపడతాయి. వారు మనసు పెడితే పాఠాలు మర్చిపోవడానికి అవకాశం ఉండదు. చెప్పిన పాఠాలు త్వరగా గ్రహించడానికి డిజిటల్ విద్యా విధానం ఉపయోగపడుతుంది.

– మమత, మ్యాథ్స్ టీచర్

ఏర్పాటు చేస్తున్నారు



పాఠశాలకు ఐఎఫ్‌పీలను సరఫరా చేశారు. వాటిని తరగతి గదుల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లను ఐఎఫ్‌పీలకు అటాచ్ చేసుకుని విద్యనందిస్తారు. ఈ విధానం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఎస్.నరసింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు, కోవూరు జెడ్పీహెచ్ఎస్

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ రహమత్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల తమ ప్రాంతంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటించారన్నారు. వివిధ పనుల కోసం సచివాలయ నిధుల నుంచి రూ.10 లక్షలను మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్షాద్, మహబూబ్‌బాషా, మున్నా, ముజాహిద్, ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని చంద్రబాబునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రామికనగర్, కుమ్మరగుంట, చంద్రబాబునగర్ ప్రాంతాల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ కుకాటి ప్రసాద్‌రావు, రూరల్ ఎంఈఓ మురళీ, వీఆర్వో సంస్థ ప్రతినిధి పీటర్ బోస్కో, కో–ఆర్డినేటర్ గోపాల్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కారానికి నోచుకుంటున్నాయని తెలిపారు. భూ పట్టా ఇచ్చే సమయంలో అవకతవకలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచేలా చూడాలన్నారు. అధిక సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి జిల్లాను మొదటిస్థానంలో నిలపాలన్నారు. కాంట్రాక్టర్లు జాప్యం చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. కాంట్రాక్టర్లు అదనంగా పొందిన నగదును రికవరీ చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకుని నిర్మాణాల్లో జాప్యం జరిగితే ఏఈలే బాధ్యత వహించాలన్నారు. పరిశ్రమల వల్ల ఇబ్బందులు పడే ప్రాంతాల్లో భూమి ఇచ్చిన వారికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. యాజమాన్యాల ఇష్టపకారం కాకుండా నిబంధల మేర ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందుల్లేకుండా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. భూ సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నెల్లూరు ఆర్డీఓ మలోల, అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పరిష్కారం



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): స్పందన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి 145 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాల పేరిట కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తరహా ఫిర్యాదులపై తక్షణమే కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ప్రసాద్, నెల్లూరు రూరల్, ఎస్సీ, ఎస్టీ సెల్–2, ఏఆర్ డీఎస్పీలు పి.వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసరావు, గాంధీ పాల్గొన్నారు.